రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?

- ఆర్మూర్, ఆలూరు మండలాల పరిధిలో దెబ్బతిన్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఇస్సాపల్లిలో పోచమ్మ ఆలయం వద్ద బురదమయంగా మారిన రోడ్డు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలాల్లో రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉంది. గ్రామాల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. అదే రోడ్లపై పంట పొలాలకు వెళ్లే ట్రాక్టర్లు ప్రయాణించడంతో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పాదచారులతో పాటు ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసిన తర్వాత నిధులు మంజూరు కావడం లేదు. నిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఏమీ చేయలేని పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం దసరా నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బురదతో గుంతలమయంగా ఉన్న రోడ్లపై శోభాయాత్ర, జంబికి వెళ్లడం కష్టంగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో పోచమ్మ ఆలయం వద్ద రోడ్డు పరిస్థితి భయానకంగా మారింది. దసరా పర్వదినం రోజున ఇదే మార్గం మీదుగా గ్రామస్తులు జంబి దర్శనం చేసుకుంటారు. అలాగే రథంతో ఊరేగింపు నిర్వహిస్తారు. రోడ్లు ఇలానే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారులు శ్రద్ధ తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశం



పోచమ్మ ఆలయం వద్ద రోడ్డు అడుగు లోతు గుంతలతో బురదమయంగా మారింది. నడవడానికి వీలు లేకుండా ఉంది. దసరా రోజున రథంతో ఊరేగింపు నిర్వహిస్తాం. ప్రమాదాలు జరగక ముందే అధికారులు రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలి.

– ఎంసీ లింగన్న, గ్రామస్తుడు, ఇస్సాపల్లి

అక్రమంగా ఆస్తి మార్పిడి

- విషయం బయటపడటంతో బాధితుల ఆందోళన
- న్యాయం చేయాలని వేడుకోలు


ధర్నా నిర్వహిస్తున్న బాధిత మహిళ బంధువులు

రెంజల్(బోధన్): అందినకాడికి దండుకుని అక్రమంగా ఆస్తి మార్పిడి చేయడంతో నీలా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసి ఇటీవలే బోర్గాం గ్రామానికి బదిలీ అయిన కార్యదర్శి రాణి నిర్వాకం ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. స్థిరాస్తులను మార్పిడి చేయడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు ఆన్‌లైన్ కోసం అడిగినంత అందించినా చేయకపోవడంతో ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని వాగ్వాదానికి దిగుతున్నారు. కార్యదర్శి తీరుకు నిరసనగా శుక్రవారం బాధిత మహిళ కుటుంబ సభ్యులు పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన అనీస్‌బేగం గ్రామంలోని ఓ నాలా, లేఅవుట్ లేని వెంచర్‌లో రెండు ప్లాట్లు కొనుగోలు చేశారు. అందుకు సంబంధించిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని మ్యుటేషన్(ఆస్తిమార్పిడి) కోసం మీసేవలో నిబంధనల ప్రకారం సొమ్ము చెల్లించి జీపీలో దరఖాస్తు చేసుకున్నారు. కార్యదర్శి రాణి చెప్పిన మాట ప్రకారం అడిగినంత అందించడంతో పంచాయతీలో రూ.200 చొప్పున రసీదులు అందించి ఒక ప్లాటును మాత్రమే మ్యుటేషన్ చేశారు. ఇదేమి తెలియని నిరుపేద నిరక్షరాస్యులు ప్లాట్లలో పొగాకు నారుమడులకు చదును చేస్తుండగా గ్రామానికి చెందిన అలీం అనే వ్యక్తి వచ్చి తన ప్లాటులో ఎలా నారుమడి వేస్తావని వాగ్వాదానికి దిగి నారుమడులను దున్నేశాడు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కార్యదర్శి అతని పేరున రిజిస్ట్రేషన్ లేకున్నా డబ్బులు తీసుకుని మ్యుటేషన్ చేసినట్లు బాధిత కుటుంబీకులు ఆరోపించారు. తమకు అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

డీపీవో దృష్టికి తీసుకెళ్లా

అనీస్‌బేగంకు సంబంధించిన కేసుతో పాటు అనేక మంది తన వద్దకు వచ్చి రాద్ధాంతం చేస్తున్నారు. ఈ విషయమై డీపీవో దృష్టికి తీసుకెళ్తాను. గతంలో జరిగిన పొరపాట్లకు తాను బాధ్యత వహించనని వివరించారు.

–సాయిలు, ప్రస్తుత కార్యదర్శి, నీలా

క్లుప్తంగా

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



ఆర్మూర్‌టౌన్: త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా అధికార ప్రతినిధి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్ కుమార్ కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అప్లికేషన్ ఫామ్‌లను బీజేపీ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని, గతంలో ఓటరుగా నమోదైనా మళ్లీ చేయించుకోవాలన్నారు. అలాగే నందిపేట్ నాగ సురేష్‌ను ఆర్మూర్ అసెంబ్లీ పట్టభద్రుల ఎమ్మెల్సీ కో కన్వీనర్‌గా నియమించారు. బీజేపీ నాయకులు పులి యుగేంధర్, కృష్ణ, కిరణ్‌కుమార్, కలిగొట ప్రశాంత్, తదితరులున్నారు.

బీఎస్ఎన్ఎల్ జిల్లా అడ్వైజరీ మెంబర్‌గా బాల్కొండవాసి



బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు బాల్కొండ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఆరేపల్లి నర్సయ్యను నిజామాబాద్ జిల్లా బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఆరెపల్లి నర్సయ్య మీడియతో మాట్లాడుతూ.. పార్లమెంట్ నియోజకవర్గంలో ఎనిమి ది మంది సభ్యులకు గాను నన్ను ఒకడిగా ఎన్నుకున్నందుకు ఎంపీ అరవింద్ ధర్మపురి, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బాల్కొండ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

నందిపేట నుంచి.. ఎలిగేటి రాజు



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రానికి చెందిన ఎలిగేటి రాజును బీఎస్ఎన్ఎల్ జిల్లా అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఎలిగేటి రాజు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఎంపీ ధర్మపురి అరవింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ ఫ్యామిలీ సర్వే పరిశీలన

బాల్కొండ: మండలంలోని శ్రీరాంపూర్ గ్రామంలో చేపడుతున్న డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను ఆర్మూర్ డీఎల్‌పీవో శివ కృష్ణ శుక్రవారం పరిశీలించారు. సర్వే పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీవో ఆర్ గంగామోహన్, పంచాయతీ కార్యదర్శులున్నారు

బాధ్యతల స్వీకరణ

బాల్కొండ: మెండోరా మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డివిజన్ -1 సూపరింటెండెంట్‌గా అమరగోని రవీందర్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చక్రపాణి, డీఏవో రాజలింగ గౌడ్, రిటైర్డ్ సూపరింటెండెంట్ జాన్ సుభాకర్‌లు కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. డీఈఈలు గణేష్, సుకుమార్, గంగభూషణ్, రఘుపతి, తదితరులున్నారు

వీడీసీ సభ్యులకు సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆలూర్ వీడీసీ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, ములాకిడి శ్రీనివాస్ రెడ్డి, వైస్ మల్లారెడ్డి, బీరయ్య, నారాయణ, రాజేందర్, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం రెడ్డి, ఉపాధ్యక్షులు నవనీత్, సంతోష్, కోశాధికారులు సుమన్, గంగా రెడ్డి, ప్రధాన కార్యదర్శులు జాన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విరాళం



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని పులి చెరువు దగ్గర గంగపుత్రుల ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న గంగమ్మ తల్లి దేవాలయానికి మండల బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ శుక్రవారం రూ.20 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ సాయి, గంగపుత్రులు సందీప్, లక్ష్మణ్, శ్రీనివాస్, హనుమంతు, మల్లేష్ తదితరులున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడుతుందని విద్యుత్ డీఈ హరిచంద్ తెలిపారు. పట్టణంలోని 33కేవీ లైన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

కాలానికనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి


వివేకానంద రెడ్డిని సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుని విద్యార్థులకు బోధన చేయాలని ఆర్మూర్ ఎంపీఐ వివేకానంద రెడ్డి పేర్కొన్నారు. పెర్కిట్‌లో శుక్రవారం ఆర్మూర్ మండల ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలను తెలియజేయడానికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటే పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన ట్రాఫిక్ నియమ నిభందనలపై అవగాహన కల్పించారు. ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు భరత్‌చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్య ప్రవీణ్, కోశాధికారి స్కాలర్స్ వేణు, భాషిత సుందర్, మల్లేష్ గౌడ్, గంగా రెడ్డి, నలంద సాగర్, మానస గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరి పంట


వర్ని పరిధిలోని వరి పంట

వర్ని: పంటలు చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురియడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఉమ్మడి వర్ని మండలంలోని వర్ని, జాకోరా, హుమ్నాపూర్, ఘన్పూర్, చందూర్, గోవుర్, మోస్రా గ్రామాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట నేడు రేపు కోద్దామనే సరికే వర్షం పడటంతో పంట నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం ధాటికి పంట నేలకొరిగి, నీటిలో తడిసి, గింజ రాలి నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో బోధన్ నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ(జిల్లా పట్టభద్రుల ఎన్నికల కన్వీనర్) మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌రోల్ మెంట్ ఎలా చేయాలో వివరించారు. వర్క్ షాప్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ కొండా ఆశన్న, నియోజకవర్గ కన్వీనర్ సుధాకర్‌చారీ, పట్టణ కన్వీనర్ మిర్జాపురం, రూరల్ కన్వీనర్ సుదర్శన్, సాలూర మండల కన్వీనర్ ప్రకాష్, టీచర్స్ ఎమ్మెల్సీ బోధన్ నియోజకవర్గ కన్వీనర్లు పబ్బమురళి, సుధాకర్, రాజేందర్ సింగ్, సాయాగౌడ్ తదితరులున్నారు.

సమాచారం లేకుండా నీటిని వదిలారు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ఎలాంటి సమాచారం లేకుండా ప్రాజెక్టు అధికారులు వదిలారని వరద కాలువలో చేపలు వేటాడుతున్న బాల్కొండ మండలం వన్నెల(బి) గ్రామ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వరద కాలువ వద్ద మత్స్యకారులు విలేకరులతో మాట్లాడారు. వరద కాలువలో గురువారం నీటి విడుదల నిలిపి వేయడంతో చేపల వేట కోసం శుక్రవారం ఉదయం నుంచి వరద కాలువలో దిగామన్నారు. నీటిని వదలడం వల్ల కాలువలో కొట్టుకు పోయేవాల్లమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా నీటిని వదిలిన ప్రాజెక్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సన్మాన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



పెర్కిట్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సన్మాన కార్యక్రమానికి ఆర్మూర్, ఆలూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలి వెళ్లారు. ఆలూర్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

ఉమ్మడి వర్ని నుంచి



వర్ని: ఉమ్మడి వర్ని మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో భారీగా నేతలు తరలివెళ్లారు.

డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఒక చోట చేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. సంబురాలకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి హాజరై విద్యార్థులతో బతుకమ్మ ఆడారు. పట్టణ శివారులోని పసుపు వాగు వద్దకు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జం చేశారు. ముందుగా కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన వివిధ వంటకాలను చైర్ పర్సన్ రుచి చూశారు. కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్, డైరక్టర్ రమణి, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి గ్రామంలో సామాజిక కార్యకర్త, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎంఏ హకీమ్ విజయదశమి పండుగ పురస్కరించుకుని జీపీ కార్మికులకు శుక్రవారం నూతన దుస్తులు అందజేశారు. జీపీ కార్మికులకు ప్రతి నెల వేతనాలు రానందున ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నందున తన వంతు సహాయంగా దసరా పండుగకు దుస్తుల పంపిణీ చేశానన్నారు. నాలుగు నెలలు జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా జీవనాన్ని సాగిస్తారని ప్రశ్నించారు. మాజీ ఎంపీటీసీ రాములు, దేవ్‌సింగ్, షేరు, సజ్జత్ ఉన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో శుక్రవారం టీఎస్ఆర్టీసీ కార్గో సేవలను ఆర్మూర్ డిపో ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నలుమూలలకు కార్గో సేవలను ఆర్టీసీ ద్వారా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఆర్టీసీ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం


వేల్పూర్: లక్కోర గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాలక్ష్మి ఆలయ ఐదవ వార్షికోత్సవం నిర్వహించారు. యజ్ఞం, ప్రత్యేక పూజలు చేసి వలగొడుగుతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలి



బోధన్: వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం రాత్రి బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోను తెలంగాణ వీఆర్‌ఏ వారసుల సంఘ ప్రతినిధులు, సభ్యులు కలిసి వినతి పత్రం అందించారు. 12 ఏళ్లుగా వీఆర్‌ఏల వారసులుగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ సేవల్లో కొనసాగుతున్న వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వలేదని వారు తెలిపారు. ప్రతినిధులు హన్మాండ్లు, అబ్బులు, భూమయ్య, గంగారాంపాల్గొన్నారు.

10 క్వింటాళ్ల వరకు సోయా కొనుగోలు చేయాలి



సుభాష్‌నగర్/డిచ్‌పల్లి: రైతులు పండించిన సోయాబీన్ పంటను ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లాకు విచ్చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సోయాబీన్ పంటను ఎకరానికి 6 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ ఉన్నారు.

సోయా పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి

వేల్పూర్: సోయాబీన్ పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా సగం పంటను కాకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 6 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే మొక్కుబడిగా కొనుగోలు చేయడం రైతులను మోసగించడమేనని అన్నారు. సోయాబీన్ పంట ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా మద్దతు ధరకు రూ.500 బోనస్ కలిపి చెల్లించాలన్నారు. లేదంటే రైతుల పక్షాన పోరాడతామన్నారు.

ఎస్సీ ఎస్టీల సమస్యలు త్వరగా పరిష్కరించాలి


ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎడపల్లి(బోధన్): జాన్కంపేట గ్రామానికి శుక్రవారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రావడంతో ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు డల్లా సురేష్ మాదిగ, జగ్జీవన్ రామ్ మాదిగ దండోరా సంఘం(జాన్కంపేట) ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. జాన్కంపేట చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను బాబు జగ్జీవన్‌రామ్ మాదిగ దండోరా సంఘ సభ్యులు సన్మానించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు డల్లా సురేష్ మాదిగ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వాలని, అదే సమయంలో బాధితులకు ప్రభుత్వ పరంగా వచ్చే నిధులను కూడా విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నేతలు పానుగంటి సాయిలు, రాజశేఖర్ పాల్గొన్నారు.

9న మహాలక్ష్మి ట్రస్ట్ కమిటీ ఎన్నికలు


మాట్లాడుతున్న ఎన్నికల కమిటీ ప్రతినిధి శంకర్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ మహాలక్ష్మి ట్రస్ట్ నూతన కమిటీ(గ్రామాభివృద్ధి) ఎన్నికలు 9న నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మి మందిరంలో గల కల్యాణ మండపంలో గ్రామ పెద్దలతో కలిసి ఎన్నికల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిటీ ప్రతినిధి శంకర్ మాట్లాడారు. నేటి నుంచి నామినేషన్‌లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్‌లు దాఖలు చేసిన వారికి గుర్తులను 8న కేటాయిస్తామని, ఇప్పటికే ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం కోసం సన్నాహాలు చేస్తున్నామని, ఏకగ్రీవం కాని పక్షంలో 9న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండారి పోశెట్టి, ఎంబెల్లి శంకర్, అజయ్, సాయిలు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	బహిర్భూమి (తెలుగు) - 10.50, మిస్టర్ సెటబ్రిటీ (తెలుగు) - 1.30 చిట్టిపొట్టి - 4.15 జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్) - 7.15 సత్యం సుందరం - 10.30
స్క్రీన్-2 –	దేవర(తెలుగు)-11.00, 02.35, 6.10, 9.45
స్క్రీన్-3 –	కాళి (తెలుగు) - 11.05 జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్) - 1.15, దక్షిణ (తెలుగు) - 4.30, దేవర - 7.00, రామ్‌నగర్ బన్నీ - 10.35
స్క్రీన్-4 –	స్వగ్ (తెలుగు) - 12.00, 3.20, 6.40, 10.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 - 12.55 4.10.
స్క్రీన్-2	దేవర పార్ట్-1 (తెలుగు)- 10.30 సత్యం సుందరం - 1.40 7.30 రామ్‌నగర్ బన్నీ -4.30 10.30
స్క్రీన్-3	స్వాగ్(తెలుగు)- 10.25 1.30 7.30 10.30 దక్షిణ (తెలుగు)-4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 (తెలుగు)- 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-2	స్వగ్(తెలుగు)-12.25 7.00 జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్)-3.45 సత్యం సుందరం(తెలుగు)-10.20
స్క్రీన్-3	జోకర్ ఫోలి ఏ డేయస్(ఇంగ్లీష్)-12.35 6.00 9.15 కాళి(తెలుగు)- 3.50
స్క్రీన్-4	బహిర్భూమి (తెలుగు)-11.05 మిస్టర్ సెలెబ్రిటీ (తెలుగు)-1.45 చిట్టిపొట్టి (తెలుగు)-4.30 దక్షిణ (తెలుగు)-7.30 రామ్‌నగర్ బన్నీ (తెలుగు)-10.00
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	స్వాగ్ (తెలుగు)
నటరాజ్	సత్యం సుందరం (తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. అమ్మవారు శుక్రవారం భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చింది. ఈసందర్భంగా పలువురు పట్టువస్త్రాలు సమర్పించారు. – సాక్షి నెట్‌వర్క్


మాక్లూర్: పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుచరితారెడ్డి


నందిపేట:కౌల్పూర్ ఆశ్రమంలో..


ఎడపల్లి: కుంకుమార్చనలో మహిళలు


ఆర్మూర్‌టౌన్ : కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


హెగ్డోలిలో గాయత్రీదేవిగా దుర్గామాత